సాక్షి ఒడిశా

గురువారం । 27 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,81,214లు, బంగారం 850 మిల్లీగ్రాములు, వెండి 130 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నేడు శాసనసభ ముట్టడి

ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు గురువారం శాసనసభను ముట్టడించనున్నాయి.

- 8లో



పాలిథిన్ వినియోగంపై ఉక్కుపాదం

రాయగడ పట్టణంలో పాలిథిన్ వినియోగంపై మున్సిపల్ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది.

- 8లో

న్యూస్‌రీల్

ఏసీ లక్ష్మీ బస్సులు ప్రారంభం



కొత్తగా వేసిన ఏసీ బస్సు

జయపురం: ముఖ్యమంత్రి బస్సు సేవా పథకంలో భాగంగా జయపురం నుంచి ఏడు ఏసీ లక్ష్మీ బస్సులను బుధవారం ప్రారంభించారు. కొత్త బస్సులు జయపురం – గుణుపూర్, జయపురం – కాశీపూర్ వయా లక్ష్మీపూర్, జయపురం – మల్కన్‌గిరి, జయపురం – కొటియ, జయపురం – చందాహండి, జయపురం – భవానీపట్న, జయపురం – కొటాగాంకు వేశారు. ఒక్కొక్క బస్సులో 50 సీట్లు ఉంటాయని ఓఎస్‌ఆర్టీసీ అధికారులు తెలియజేశారు. సర్వీసులను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

మహిళల పాత్ర గురుతరమైనది



వర్క్‌షాపులో పాల్గొన్న ఈశ్వర పాణిగ్రాహి తదితరులు

జయపురం: సహకార సంస్థల ప్రగతి, ఉద్యమంలో మహిళల పాత్ర గురుతమైనదని వక్తలు పేర్కొన్నారు. స్థానిక కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ సభా గృహంలో 'సహకార సమృద్ధి – మహిళల భూమిక'పై బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. కేసీసీ బ్యాంక్ పరిచాలన కమిటీ అధ్యక్షుడు ఈశ్వర చంద్ర పాణిగ్రాహి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. సమాజంలో మహిళల ఆర్థిక, సామాజిక ఉన్నతి కోసం ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయని వివరించారు. సహకార ఆందోళనలో మహిళలు మమేకమైతే అది సమాజానికి మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. మహిళలు పశుపాలన, వ్యవసాయ యాజమాన్యంపై అవగాహన పొందాలని సూచించారు. అనంతరం పలు ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు కేసీసీ బ్యాంకు రూ.5 లక్షల చొప్పున రుణాలు అందజేసింది. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సాశ్మిత మెలక, డీఆర్‌సీఎస్ భీమసేన్ సాహు, ఏఆర్‌సీఎస్ శశానంద బెహర, డీఈవో కమల లోచన మఝి, ఏజీఎం హరిశ్చంద్ర బొనాగడి, కేసీసీ బ్యాంక్ డైరెక్టర్ రమాకాంత రౌలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్ పట్వారీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: తమ సమస్యలు పరిష్కరించాలని ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్ల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఫరూల్ పటావ్రీని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని ట్రాక్టర్లు నడుపుతున్నప్పటికీ, ప్రభుత్వ విధానాల వలన పూట గడవడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ గృహ, రహదారి నిర్మాణ పథకాలు కోసం ఇసుక, రాళ్ల వంటివి సరఫరా చేసేందుకు అనుమతులు ఇచ్చినప్పటికీ, రాయల్టీ సరిగ్గా ఇవ్వడం లేదని వాపోయారు. ఇసుక లోడ్ కోసం అనుమతి ఇస్తే వై ఫారం (ట్రాన్సిట్ పాస్) జారీ చేసినప్పటికీ, అది కేవలం గంటన్నర వ్యవధి మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఆ వ్యవధి దాటితే ట్రాక్టర్‌ను సీజ్ చేసి సుమారు రూ.40 వేల జరిమానా విధిస్తుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకవేళ సీజ్ చేస్తే తిరిగి చేతికి వచ్చేసరికి నెల రోజులు సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ గోడు విని నిబంధనలు సడలించాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో దూడల శ్రీనివాస రావు, వై.చంద్ర, కిషోర్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో బలరాం మటం మృతి



కొరాపుట్: జిల్లాలోని నందపూర్ సమితి మాజీ చైర్మన్ బలరాం మటం (57) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఆయన 1997 నుంచి 2002 వరకు జనతాదళ్ పార్టీ మద్దతులో పదవిలో కొనసాగారు. పాడువా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లురు గ్రామ పంచాయతీ దిమిరి ఖుతుబ్ గ్రామంలో అంత్యక్రియలు ముగిశాయి. బీజేడీ మాజీ ఎంపీ జిన్ను హిక్కా, మాజీ ఎమ్మెల్యేలు రఘురాం పాడాల్, పీతం పాఢీ, ప్రఫుల్ల పంగిలు సంతాపం తెలిపారు.

గందరగోళం..!



శాసనసభలో మంగళవారం రాత్రి కాంగ్రెస సభ్యుల నిరాహార దీక్ష



శాసనసభ గేటు దగ్గర నెలకొన్న ఉద్రిక్తత

- రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు
- రాత్రంతా శాసనసభలో కాంగ్రెస్ సభ్యుల నిరసన
- శాసనసభ నుంచి కాంగ్రెస్ సభ్యులంతా సస్పెండ్

భువనేశ్వర్: బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకొని రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. సమావేశాల్లో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం నిరవధికంగా కొనసాగుతోంది. ఇరుపక్షాలు ఎవరి పట్టుపై వారు నిశ్చలంగా ఉండడంతో సభా కార్యకలాపాలు సక్రమంగా కొనసాగలేదు. ప్రధానంగా రాష్ట్రంలో మహిళలకు కనీస భద్రత లేకుండా పోయిందని కాంగ్రెస్ ఆరోపించింది. మైనర్ బాలికలకు విద్యా సంస్థల్లో మౌలిక రక్షణ కొరవడిందని దుమ్మెత్తిపోసింది. ఈ పరిస్థితిపై రాష్ట్ర హోమ్ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సభలో వివరణ ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసింది. మహిళలకు లోపించిన భద్రత పరిస్థితిపై విచారణకు సభా కమిటీ ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. అయితే దీనికి అధికార పక్షం ససేమిరా అనడంతో సభలో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది.

సభా కార్యకలాపాలకు విఘాతం

రాష్ట్రంలో మహిళల భద్రత కోసం సభలో ఉద్యమించిన కాంగ్రెసు సభ్యుల తీరును అధికార పక్షం తప్పు బట్టింది. ఈ వ్యవహారంలో సభలో సభ్యుల తీరు ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదని బాహాటంగా విమర్శించింది. తదుపరి దశలో కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతిని సభ నుంచి 7 రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు స్పీకర్ సురమా పాఢి ప్రకటించారు. దీంతో అకస్మాతుగా వ్యతిరేకత తారా స్థాయికి తాకింది. ఈ చర్యపై ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ కూడా విచారం వ్యక్తం చేసింది. ఇలా రోజులు గడుస్తున్నా వివాదం కొలిక్కి రాకపోవడంతో సభా కార్యకలాపాలకు తీవ్రంగా గండి పడింది.

12 మంది సస్పెన్షన్

మంగళవారం నాటికి ఈ పరిస్థితి మరింతగా రాజుకుంది. సభలో కాంగ్రెసు సభ్యుల బలం 14 మంది కాగా, అత్యధికంగా 12 మంది సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేసినట్లు స్పీకర్ ప్రకటించారు. దీంతో మిగిలిన ఇరువురు సభ్యులు సభలో తోటి సభ్యుల సస్పెన్షన్ వ్యతిరేకిస్తూ, సభా కమిటీ ఏర్పాటు నినాదంతో సభలో నిరసన ప్రదర్శన కొనసాగించారు. తమ న్యాయ సమ్మతమైన ప్రతిపాదనలపై సభ సానుకూలంగా స్పందించకుంటే రాత్రంతా సభలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. వీరి హెచ్చరికపై సభ పెడచెవి వైఖరి ప్రదర్శించడంతో మంగళవారం రాత్రంతా కాంగ్రెసు సభ్యులందరూ కలిసి సభలో నిరాహార దీక్ష చేపట్టారు.

సభ బయట ఉద్రిక్తత

సభ లోపల తోటి సభ్యుల నిరాహార దీక్ష స్థితిగతులను తెలుసుకునేందుకు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఆధ్వర్యంలో పలువురు మాజీ ఎమ్మెల్యేలు శాసనసభ ప్రాంగణానికి చేరారు. దీంతో లోపలికి వెళ్లకుండా వీరిని పోలీసు ఉన్నతాధికారులు అడ్డుకున్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యేలు విరుచుకుపడ్డారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ వేడెక్కింది. ఫలితంగా శాసనసభ బయట ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

అమానుష చర్యలు

సభలో నిరాహార దీక్షకు దిగిన కాంగ్రెసు సభ్యులకు తాగునీరు, మరుగుదొడ్డి వంటి మౌలిక సౌకర్యాలు లేకుండా అధికారులు అమానుష చర్యలకు పాల్పడ్డారు. దీంతో క్రమంగా ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఆరోగ్యం దిగజారింది. పోలీసులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి నిరాహార దీక్ష కొనసాగిస్తున్న కాంగ్రెసు ఎమ్మెల్యేలను బలవంతంగా బయటకు నెట్టేశారు. పదవిలో ఉన్న శాసనసభ్యులపై పోలీసుల జులుం సర్వత్రా చర్చనీయాంశం అయింది.

మరో ఇద్దరు సైతం సస్పెండ్

పరిస్థితి ఇలా కొనసాగుతుండగా మిగిలిన ఇద్దరు కాంగ్రెసు ఎమ్మెల్యేలను సైతం సభ నుంచి మరోసారి వారం రోజుల వరకు సస్పెండ్ చేసినట్లు స్పీకర్ బుధవారం దేశాలు జారీ చేశారు. మరోవైపు తారా ప్రసాద్ బాహిణీపతికి రెడ్ కార్డు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భావ వ్యక్తీకరణకు కనీస అవకాశం కల్పించకుండా సస్పెండ్ చేశారని తారా ప్రసాద్ బాహిణీపతి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నిలువునా హతమార్చిందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల సమస్యల కోసం పోరాడుతున్న తమపై పోలీసులు జులుం ప్రదర్శించారు. తెల్లవారుజామున 2.15 గంటల ప్రాంతంలో సభలో నిరసన ప్రాంగణంలోకి పోలీసులు ప్రవేశించారు. నిరసన కొనసాగిస్తున్న తమపై చేయి చేసుకుని బలవంతంగా బయటకు నెట్టారని ఆరోపించారు. ఈ క్రమంలో పోలీసులు తన గొలుసు లాక్కున్నారని ఆరోపించారు.



సభ బయట నిరీక్షిస్తున్న పీసీసీ చీఫ్, ఇతర సీనియర్ నాయకులు



మాస్టర్ క్యాంటిన్ ఛక్ నడి రోడ్డు మీద తారా ప్రసాద్ నిరసన

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన సీఎం మోహన్‌చరణ్ తదితరులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ హరీష్ టండన్

భువనేశ్వర్: ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హరీష్ టండన్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన 35వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడం విశేషం. హైకోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ మంత్రి సురేష్ కుమార్ పూజారి, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, హైకోర్టు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు హాజరయ్యారు. ఈ ఏడాది జనవరి 19 నుంచి ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవి ఖాళీగా ఉంది. 11 నెలల స్వల్ప పదవీ కాలంతో జస్టిస్ చక్రధరి శరణ్ సింగ్ పదవీ విరమణ చేసినప్పటినుంచి ఈ పదవి ఖాళీ అయింది. అప్పటి నుంచి జస్టిస్ అరిందం సిన్హా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు.

అమ్మవారికి ఇత్తడి సింహాల వితరణ



ఇత్తడి సింహాలమూర్తులతో దాతలు చంద్రశేఖర్ దంపతులు

రాయగడ: పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని బొబ్బిలిలో ఉన్న మహేశ్వరి కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ కోడిరామ్మూర్తి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంస్థల యజమాని రంబా చంద్రశేఖర్, సుగుణ దంపతులు మజ్జిగౌరి అమ్మవారికి ఇత్తడితో రూపొందించిన రెండు సింహాలమూర్తులను వితరణగా బుధవారం అందజేశారు. 300 కిలోల బరువు ఉన్న ఇత్తడితో రూపొందించిన ఈ సింహాలను అమ్మవారి ప్రవేశ ద్వారం ముందు ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు దాతలు బుధవారం ప్రత్యేక పూజలను అమ్మవారి మందిరం ప్రాంగణంలో నిర్వహించారు. కాగా ఏప్రిల్ 8వ తేదీ నుంచి అమ్మవారి చైత్రోత్సవాల ప్రారంభ సమయంలో ఇత్తడి సింహాలను ప్రాణ ప్రతిష్ఠించిన అనంతరం, వాటిని ఏర్పాటు చేస్తామని ట్రస్టు సభ్యులు తెలియజేశారు.

రామకృష్ణనగర్‌లో చోరీ



చోరీకి గురైన ఇల్లు



బాధితుడు చంద్రమౌళి ప్రసాద్ బెహర

రాయగడ: స్థానిక రామకృష్ణనగర్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఒక ఇంట్లో చొరబడి బీరువాలను విరగ్గొట్టి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును దొంగిలించినట్లు బాధితుడు సదరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రామకృష్ణనగర్ పోస్టాఫీసు వీధిలో నివాసముంటున్న చంద్రమౌళి ప్రసాద్ బెహర అనే వ్యక్తి కొరాపుట్ వేళ్లేందుకు మంగళవారం రాత్రి ఒంటిగంట సమయంలో నిద్రలేచి చూసేసరికి ఇంటి బయట ఎవరో ఉన్నట్లు గమనించాడు. దీంతో బయటకు వెళ్లి చూసి తిరిగి ఇంటి లోపలకి వెళ్లిపోయాడు. కొద్దిసేపు తర్వాత మరింత శబ్దం వినిపించడంతో బయటకువచ్చి చూడగా తమ కింది ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. అప్పుడు ఇంటి లోపలికి వెళ్లి చూడగా ఇంట్లోని రెండు బీరువాలు, వస్తువులు చిందరవందరగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఎంత మొత్తం బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించారు అనేది తెలియలేదు.

రాజధానికి కాంగ్రెస్ శ్రేణులు



ప్రత్యేక బస్సులో రాజధాని వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

కొరాపుట్: ప్రదేశ్ కాంగ్రెస్ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాజధాని భువనేశ్వర్‌కు బుధవారం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ నుంచి ప్రత్యేక బస్సుల్లో బయల్దేరారు. మరోవైపు నబరంగ్‌పూర్ జిల్లా నుంచి పిసిసి మాజీ ఉపాధ్యక్షుడు మున్నా త్రిపాఠి నేతృత్వం కాంగ్రెస్ కార్యకర్తలు బయల్దేరారు. గురువారం అసెంబ్లీ ముట్టడి కార్యాక్రమంలో వీరు పాల్గోనున్నారు.

రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు



బాధితురాలు కాంతమ్మ

జయపురం: పట్టణంలో చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. మహిళలు ఒంటరిగా కనిపిస్తేచాలు వారి మెడల్లో బంగారు గొలుసులు, పుస్తెలతాళ్లు తెంచుకుపోతున్నారు. ఇటీవల ఇద్దరి మహిళల నుంచి బంగారు గొలుసు, పుస్తెల తాడు తెంచుకుపోయిన ఘటన మరువకముందే మరో ఘటన చోటుచేసుకుంది. బుధవారం ఉదయం ముగ్గురు మహిళలు స్థానిక ఏనుగుల శాల ప్రాంతంలో ఎల్లో బ్రిడ్జి వరకు మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. వారు తిరిగి వస్తున్న సమయంలో పి.కాంతమ్మ అనే మహిళ మిగతా యువతుల కంటే వెనుకబడింది. మెల్లగా వస్తున్న ఆమె వెనుక నుంచి ముగ్గురు దుండగులు బైక్‌పై వచ్చి ఎల్లో బ్రిడ్జ్ సమీపంలో బైక్ నుంచి దిగి ఫొటో తీసుకుంటున్నట్లు నటించారు. కాంతమ్మ వారి బైక్‌కు సమీపంలోకి రాగానే వెంటనే ఆమె మెడలో మంగళసూత్రం తెంచుకొని పరారయ్యారు. ఘటనతో ఖంగుతిన్న ఆమె అరవడంతో కొంతమంది వచ్చి దుండగులను పట్టుకునేందుకు విఫలయత్నం చేశారు. ఘటనపై ఆమె జయపురం సదర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించినట్లు సదర్ పోలీసు అధికారి సచిన్ ప్రధాన్ వెల్లడించారు.

ఆదర్శ వివాహం



ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులతో రెండు కుంటుంబాల సభ్యులు



చేతులకు కంకణాలు కట్టుకొని వివాహం చేసుకుంటున్న పెళ్లిజంట

పాలకులు వరకట్నాలు నిషేధించినా, ప్రస్తుత కాలంలో కట్నాలు లేకుండా వివాహాలు జరగడం లేదు. అంతేకాకుండా వివాహం జరిగిన తర్వాత కూడా అదనపు కట్నాలు తీసుకొని రమ్మని వేధింపులకు గురి చేస్తున్న ఘటనలు ఎన్నో చూస్తున్నాం. ఇటువంటి పరిస్థితుల్లో సంబల్‌పూర్‌కు చెందిన యువకుడు జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి శశాహండి యువతిని కట్నం లేకుండా వివాహం చేసుకొని ఆదర్శంగా నిలిచాడు. శశాహండి గ్రామానికి చెందిన మదన దాస్, సబితా దాస్‌ల కుమార్తె అనితా దాస్‌కు, సంబలపూర్ పట్టణానికి చెందిన నిరంజన్ దాస్, సబితా దాస్‌ల కుమారుడు క్షరోద్ దాస్‌లకు మంగళవారం ఎటువంటి ఆడంబరాలు, కట్నకానుకలు లేకుండా వివాహం జరిగింది. ఈ వివాహానికి ఇరు కుటుంబాల నుంచి కేవలం 30 మంది సభ్యులు, పూజారి మాత్రమే హాజరయ్యారు. ఎటువంటి ఆర్భాటాలు లేకుండా పూజారి వేదమంత్రాలు చదువుతుండగా ఉభయులు చేతులకు కంకణాలు కట్టుకొని భార్యాభర్తలయ్యారు. దీంతో పలువురు వీరిని అభినందించారు.

– జయపురం

క్లుప్తంగా

వ్యాన్ బోల్తా



బోల్తాపడిన వ్యాన్

రాయగడ: టమాటా లోడ్‌తో శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఒక వ్యాన్ జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి నారాయణపూర్ పంచాయతీ భాత్‌పోరొసి గ్రామం వద్ద బోల్తాపడింది. మంగళవారం సాయంత్రం సమితిలోని పూర్ణభట్ట గ్రామం నుంచి రెండు టన్నుల లోడ్తో శ్రీకాకుళం వెళ్తున్న వ్యాన్ ఎదురుగా వస్తున్న ఒక బొలేరోను తప్పించబోయి అదుపుతప్పింది. దీంతో వ్యాన్‌లోని టామాటోలు రోడ్డుపై చిందరవందరగా పడ్డాయి. వ్యాన్ డ్రైవర్, హెల్పర్లు సురక్షితంగా బయటపడ్డారు. సుమారు టన్ను వరకు నష్టపోయినట్లు యజమాని బాబి తెలియజేశారు.

టెండర్లు వేయకుండా పనుల కేటాయింపు తగదు



ఫిర్యాదు చేస్తున్న బీజేడీ నాయకులు

కొరాపుట్: ప్రభుత్వం తరుపున టెండర్లు వేయకుండా పనుల కేటాయింపు తగదని ప్రతిపక్ష బీజేడీ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు నబరంగ్‌పూర్‌లోని కలెక్టరేట్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. రికమండేషన్ల రూపంలో పనుల టెండర్లు కేటాయిస్తున్నారన్నారు. దీనివలన ప్రభుత్వ నిధులు అక్రమంగా మరలుతున్నాయని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో ఉత్తమ్ త్రిపాఠి, స్వాధీన పండా, కున్నా పాడి తదితరులు ఉన్నారు.

పాలిథిన్ వినియోగంపై ఉక్కుపాదం



స్వాధీనం చేసుకున్న పాలిథిన్ కవర్ల బస్తాలు

రాయగడ: పట్టణంలో పాలిథిన్ వినియోగంపై మున్సిపల్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. దీనిలో భాగంగా స్థానిక డైలీ మార్కెట్, కపిలాస్ కూడలిలో దుకాణాలపై బుధవారం విస్తృతంగా దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో సుమారు 600 కిలోల పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకొని, భారీగా జరిమానాలు విధించారు. పాలిథిన్ వినియోగం వలన కలిగే అనార్థాలపై చైతన్యం కల్పిస్తున్నా పట్టించుకోవడం లేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. పాలిథిన్ వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిప్యూటీ సీఎంకు ఆహ్వానం



డిప్యూటీ సీఎంకు ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం

జయపురం: జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ త్వరలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకోనుంది. దీంతో ఈ వేడుకలకు చాంబర్ అధ్యక్షుడు బి.ప్రభాకర్, కార్యదర్శి డి.మాధవ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతితో వెళ్లి డిప్యూటీ సీఎం కనకవర్ధన్ సింగ్‌దేవ్‌ను ఆహ్వానించారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి



కళాశాల అధ్యాపకులతో విద్యార్థులు

పర్లాకిమిడి: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని పరశురాం డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ బిసాయి అన్నారు. రాయఘడ బ్లాక్ సేవక్‌పూర్ వద్ద పరశురాం డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సింహాద్రి ప్రభాకర్, ప్రిన్సిపాల్ కలక తౌడు, అధ్యాపకులు అనితా పట్నాయిక్, దీపారాణి పాత్రో, భాగ్యభయ్యాన్, సునీల్‌కుమార్ బెహర దొళాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు శాసనసభ ముట్టడి



నడి రోడ్డు మీద కాంగ్రెస్ శాసన సభ్యుల నిరసన ప్రదర్శన



కాంగ్రెసు భవన్‌లో పార్టీ ప్రముఖుల అత్యవసర సమావేశం

భువనేశ్వర్: నగరంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. శాంతి భద్రతల పరిరక్షణ జంట నగరాల పోలీసు కమిషనరేట్‌కు పెను సవాల్‌గా మారింది. శాసనసభలో కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్‌పై నిరసన కట్టలు తెంచుకుంటోంది. బుధవారం నడి రోడ్డు మీద నిరసనకు దిగిన కాంగ్రెస్ సభ్యులకు మద్దతుగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. శాసనసభ వైపు దూసుకుపోయి ముట్టడించేందుకు పాల్పడ్డారు. సభా ప్రాంగణం భద్రత కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు అధిగమించి సభా ప్రాంగణం ప్రవేశ ద్వారాల తాళాలు బద్దలు కొట్టేందుకు విఫలయత్నం చేసి పోలీసు యంత్రాంగానికి ముప్పు తిప్పలు పెట్టారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ గురువారం శాసనసభ ముట్టడిస్తామని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లోగడ ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆందోళనలు భారీ ఎత్తున విజయవంతం చేయాలనే లక్ష్యంతో స్థానిక కాంగ్రెస్ భవన్‌లో పార్టీ ప్రముఖుల వ్యూహ రచన చేశారు. కాంగ్రెసు భవన్ నుంచి శాసనసభ మార్గం ఉద్రిక్తంగా మారే ప్రమాదంపై జంట నగరాల పోలీసు కమిషనరేట్ ముందస్తుగా అప్రమత్తమైంది.

రాకపోకల కట్టడి

శాసనసభ సమీపంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న ప్రదర్శన తీవ్రత దృష్ట్యా పోలీసు కమిషనరేట్ నగరంలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. ఈ నిరసన కారణంగా మాస్టరు క్యాంటిన్ కూడలి నుంచి దిగువ పీఎంజీ మార్గం గుండా శాసనసభ వైపు ఉధృత పరిస్థితి తాండవిస్తుందని అంచనా. ఈ మార్గంలో వాహనాలు, సాధారణ ప్రజానీకం రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. అవాంఛనీయ సంఘటనల నివారణ కోసం గురువారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఈ మార్గంలో రాకపోకలపై ఆంక్షలు అమలులో ఉంటాయని కమిషనరేట్ పోలీసులు తెలిపారు. ప్రధానంగా రాజ్ మహల్ స్క్వేర్ మరియు రూపాలి స్క్వేర్ మధ్య ప్రాంతాలు ముఖ్యంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. నిరసన ప్రదర్శన సమయంలో ప్రత్యామ్నాయ మార్గాల గుండా రాకపోకలకు సర్దుబాటు చేసుకోవాలని అభ్యర్థించారు. ఈ మార్గంలో మాస్టరు క్యాంటిన్ కూడలి నడి రోడ్డు మీద కాంగ్రెసు సభ్యుల నిరసన నిరవధికంగా కొనసాగుతోంది. రాత్రంతా ఈ ప్రదర్శన కొనసాగుతుందని ఆందోళనకారుల వర్గం పేర్కొంది.



శాసనసభ గేటు దగ్గర గుమిగూడిన ఆందోళనకారులు



నిరసనకారులను తొలగించే ప్రయత్నంలో పోలీసులు



మండుటెండలో నడి రోడ్డుమీద శాసనసభ్యుల వ్యూహ రచన

కదంతొక్కిన బీజేడీ



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీజేడీ సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం తీరుపై ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని, విపక్షాల ఆవేదనని అణచివేస్తూ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందిని ఆరోపించింది. ప్రజా సమస్యలపై గళం విప్పుతున్న విపక్ష సభ్యులపై అరాచకత్వం ప్రదర్శిస్తోందని మండిపడింది. రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయిల్, పాలస్తీనా మాదిరిగానే ఏదో యుద్ధం జరుగుతోందన్నట్లుగా సభలో నిరసన ప్రదర్శించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొట్టారని బీజేడీ సభ్యుడు డాక్టర్ అరుణ్ కుమార్ సాహూ పరిస్థితిని అంతర్జాతీయ సంఘర్షణలతో పోల్చారు. పోలీసులు బీజేడీ ఎమ్మెల్యేలపై కూడా దాడి చేశారని మండిపడ్డారు. 14 మంది సభ్యుల సస్పెన్షన్‌పై స్పీకర్ వైఖరి సభలో స్పష్టం చేయాలని బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై స్పీకర్ వైఖరి కొరవడడంతో బీజేడీ శాసన సభ్యులంతా శాసనసభ నుంచి బయటకు వచ్చేశారు.

స్పీకర్ ప్రకటన

అనంతరం బీజేడీ సభ్యుల ఆందోళన మేరకు సభలో స్పీకర్ సురమా పాఢి వివరణ ప్రవేశపెట్టారు. ఈనెల 25వ తేదీ వరకు 12 పని రోజులు పాటు జరిగిన మలి విడత బడ్జెటు సమావేశాలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ నిడివిలో సమగ్రంగా రాష్ట్ర శాసనసభ కార్యకలాపాల్లో 39 గంటల 2 నిమిషాల పాటు అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. సభలో సభ్యుల తీరుని చక్కదిద్దేందుకు పలుమార్లు అఖిల పక్ష సమావేశాలు నిర్వహించడం జరిగింది అన్నారు. దీనిలో భాగంగా ఈనెల 10, 13, 24, 25 తేదీల్లో వరుసగా అఖిల పక్ష సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఈనెల 21న డిప్యూటీ స్పీకర్ సభలో సభ్యులు మర్యాదపూర్వకంగా మెసులుకోవాలని అభ్యర్థించారని వెల్లడించారు. ఈ అభ్యర్థనపై నిర్లక్ష్యం ప్రదర్శించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభా కార్యకలాపాలకు అంతరాయం నిరవధికంగా కొనసాగించారు. దీని ఫలితంగా మంగళవారం 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. అయితే వారు అసెంబ్లీ ప్రాంగణాన్ని వదిలి వెళ్లడానికి నిరాకరించి రాత్రంతా ప్రదర్శన నిర్వహించారని తెలిపారు. దీంతో శాసన సభ్యులకు తగిన భద్రతా ఏర్పాట్లు చేశారన్నారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి 9 గంటలకు కాంగ్రెస్ సభ్యులు మరియు కార్యకర్తలు శాసనసభ ఆవరణలో మార్షల్స్, భద్రతా సిబ్బందిపై దాడి చేసి గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన సిబ్బందికి వైద్య చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి 2 గంటల ప్రాంతంలో సభలో కాంగ్రెసు సభ్యుల నిరసన హింసాత్మక రూపు దాల్చుకుంటున్న వైపరీత్యం దృష్ట్యా శాసన సభ మార్షల్ మరియు భద్రతా సిబ్బంది ఆధ్వర్యంలో సభ నుంచి బయటకు తొలగించారన్నారు. ముందస్తు ఆదేశాల మేరకు సిబ్బంది ఈ చర్యని చేపట్టినట్లు స్పీకర్ శాసనసభలో స్పష్టం చేశారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి క్యాంగ్ పంచాయతీ పెద్ద సేరపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఆశిష్ జలారి అనే పదకొండేళ్ల బాలుడు కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు గ్రామమంతా వెదికారు. అయినా ఎక్కడా కనిపించకపోవడంతో బుధవారం ఉదయం మత్తిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐఐసీ దేవదత్తు మల్లిక్ వెంటనే స్పందించి సబ్ ఇన్‌స్పెక్టర్ మాడ మడ్కమి, సబ్ ఇన్‌స్పెక్టర్ విష్ణుకిశోర్‌ల ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పాటు చేశారు. అనంతరం వారు గాలించగా మత్తిలి సమీపంలోని ఒక చెట్టుకింద బాలుడు కూర్చొని ఉండడం గమనించి పట్టుకున్నాడు. అయితే బాలుడి మతిస్థిమితం సరిగా లేనట్లు గుర్తించారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. తమ బిడ్డను సురక్షితంగా అప్పగించిన పోలీసులుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మెహందీ పోటీలకు విశేష స్పందన



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన మెహందీ పోటీలకు విశేష స్పందన లభించింది. మహిళలు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మొత్తం 51 మంది పాల్గొన్నారు. మెహందీ పెట్టుకోవడంలో శుభ్రత, అందం, ఆధునిక డిజైన్ వంటి వాటికి ప్రాధాన్యత కల్పిస్తూ నిర్వాహకులు విజేతలను ఎన్నుకున్నారు. పోటీల్లో ప్రథమ బహుమతిని రాధారాణి కౌసల్య గెలుచుకోగా, ద్వితీయ బహుమతిని బి.ప్రీతి, తృతీయ బహుమతిని పాయల్ దలాల్‌లు సొంతం చేసుకున్నారు. ఎం.మౌనిక, ఎంపీ ఇందు, సీహెచ్ గాయత్రీలకు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు. విజేతలకు ఈనెల 30, 31వ తేదీల్లో స్థానిక కొల్లిగుడ మైదానంలో జరగనున్న ఉత్సవాల్లో బహుమతులు ప్రదానం చేస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యాల్ల కొండబాబు తెలియజేశారు.



పోటీల్లో పాల్గొన్న మహిళలు



గెలిపొందిన మహిళలు

కుక్కల దాడిలో జింకపిల్ల మృతి



జింకను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలోని రత్తకన్న గ్రామంలో వీధి కుక్కల దాడిలో జింక పిల్ల మృతి చెందింది. సమీప కొండల నుంచి దారితప్పి గ్రామంలోనికి ప్రవేశించిన సమయంలో వీధికుక్కలు వెంటపడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వెంటనే గ్రామస్తులకు అటవీ అధికారులకు సమాచారం అందించారు. కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు ఆదేశాల మేరకు డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము, ఫారెస్టు బీట్ అధికారులు సిబ్బంది మృతిచెందిన జింకను పరిశీలించారు. గ్రామస్తుల సమక్షంలో బెల్లుపడ వెటర్నరీ సిబ్బంది పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని దహనం చేశారు. ఇదిలా ఉండగా రత్తకన్న సమీపంలోని ఎర్రమట్టి కొండల నుంచి గ్రావెల్‌ను కొందరు అక్రమంగా తవ్వేయడంతో కొండలు కరిగిపోతున్నాయని, అక్కడి వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

కోచింగ్ సెంటర్ ఎంపికకు గడువు పెంపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎంపికైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు వెబ్ ఆప్షన్‌లో కోచింగ్ సెంటర్ ఎంపిక చేసుకునేందుకు ఈ నెల 28 వరకు గడువు పొడిగించినట్లు డీడీ విశ్వమోహన రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

టెన్త్ విద్యార్థికి గాయం



వెంకటరమణకు బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

నరసన్నపేట: స్థానిక సెంట్‌క్లారెట్ స్కూల్లో పరీక్ష రాస్తున్న టెన్త్ విద్యార్థి బి.వెంకటరమణ గాయపడ్డాడు. స్కూల్లో గోడకు ఉన్న మేకు తలకు తగలడంతో రక్త స్రావమైంది. వెంటనే పీహెచ్‌సీ సిబ్బంది, మహిళా కానిస్టేబుల్ స్పందించి ప్రాథమిక చికిత్స అందించారు. బీపీ చెక్ చేసిన అనంతరం పరీక్షకు హాజరయ్యాడు. జలుమూరు మండలం బసివాడకు చెందిన వెంకటరమణ నరసన్నపేట మండలం కంబకాయ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు.

గుండెపోటుతో వీఆర్ఓ మృతి



ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని బడివానిపేట వీఆర్వో పుట్ట రాజారావు (50) బుధవారం గ్రామ సచివాలయంలో విధి నిర్వహణలో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. తోటి సిబ్బంది సీపీఆర్ చేసి 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. రాజారావు స్వస్థలం చిలకపాలెం. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కాగా, రాజారావు పనిఒత్తిడి కారణంగానే మృతిచెందారని ఉద్యోగ సంఘాల నాయకులు, వీఆర్వోలు చెబుతున్నారు. రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీరాజ్ ఇలా అన్ని సర్వేలు, పనులు తమతోనే చేయిస్తున్నారని మండిపడుతున్నారు. తాము ఎవరి పనిచేస్తున్నామో తమకే తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు కూడా ఎక్కువయ్యాయని వాపోతున్నారు. కాగా, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ సాయిప్రత్యూష, తహశీల్దార్ గోపాలరావు బుధవారం రాత్రి రాజారావు ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. మృతిపై ఆరా తీశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండంలోని చల్లపేట గ్రామానికి చెందిన హనుమంతు కృష్ణారావు(59) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ తట్టుకోలేక మంగళవారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కృష్ణారావుకు భార్య బానమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

చాకలి రేవు నిర్మాణ పనులపై సమీక్ష



పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న చాకలి రేవు చెరువు మట్టితీత పనులపై పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కంట్రాక్టర్లతో బుధవారం సమీక్షించారు. ఈ చెరువుపై పలు రజక కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. చెరువులో మట్టి, గుర్రపు డెక్క పేరుకుపోవడంతో రజక సంఘం నాయకులు చెరువు పునరుద్ధరించాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఈ పనులు గత కొన్ని రోజులుగా జరుగుతుండగా అకస్మాత్తుగా పరిశీలించారు. నిధుల సమస్య లేకుండా గ్రామీణ తాగునీరు, శానిటేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రతాప్ బెహరాతో మాట్లాడారు. పనులు వెంటనే చేపట్టినందుకు పురపాలక అధ్యక్షురాలు నిర్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

డీఈఓను విధుల నుంచి తప్పించాలి

- ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు డిమాండ్
- రెండోరోజూ కొనసాగిన నిరసన



డీఈఓ కార్యాలయం వద్ద నినదిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కుప్పిలి కేంద్రంలో మాస్ కాపీయింగ్ ఘటనలో సస్పెండైన 14 మంది ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ముందస్తు ప్రణాళికతో దాడిచేసి వ్యక్తిగత మైలేజ్ కోసం జిల్లా పరువు, ప్రతిష్ఠతలను మంటగలిపి ఉపాధ్యాయులను అన్యాయంగా సస్పెండ్ చేసిన డీఈఓ తిరుమల చైతన్యను వెంటనే విధుల నుంచి తప్పించాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సస్పెండైన టీచర్లతోపాటు డిబారైన ఐదుగురు విద్యార్థులకు న్యాయం చేయాలని నినదించారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడివేదిక ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట రెండో రోజు బుధవారం కూడా నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఉమ్మడి వేదిక ముఖ్య ప్రతినిధులు చౌదరి రవీంద్ర, తంగి మురళీమోహన్, మజ్జి మదన్‌మోహన్, డి.శివరాంప్రసాద్, పిసిని వసంతరావు తదితరులు మాట్లాడుతూ డీఈఓ ఉపాధ్యాయుల పట్ల కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 2023 సాధారణ బదిలీల నుంచి ఉపాధ్యాయులను దోషులుగా చిత్రీకరించే పనిలో నిమగ్నమయ్యారని దుయ్యబట్టారు. కుప్పిలి కేంద్రంలో జరిగిన సంఘటన అతిగా చిత్రీకరించి విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురిచేసి ప్రశాంతంగా పరీక్షలు రాయటంలో తీవ్ర ఆటంకం కలుగజేసిన డీఈఓపై, దాడిలో పాల్గొన్నవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద వందలాది మంది ఉపాధ్యాయులతో చేపట్టనున్న ఉపాధ్యాయుల పోరాట ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు కొప్పల భానుమూర్తి, బమ్మిడి శ్రీరామ్మూర్తి, గొంటి గిరిధర్, సంపతిరావు కిషోర్‌కుమార్, గురుగుబెల్లి రమణ, పేడాడ కృష్ణారావు, బల్లెడ రవి, శీర రమేష్‌బాబు, ఎంవీ రమణ, ఎస్.సత్యనారాయణ, బలివాడ ధనుంజయ్, బోనెల రమేష్, కె.పద్మావతి, బి.మోహనరావు, పప్పల రాజశేఖర్, దామోదరావు, వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

మట్టి తవ్వకాల అడ్డగింత



పలాస తహశీల్దారు కార్యాలయం వద్ద ట్రిప్పర్లు

పలాస: మండలంలోని కేదారిపురంలో మంగళవారం రాత్రి పొలంలో అక్రమంగా మట్టిని తవ్వడానికి ప్రయత్నం చేస్తుండగా అక్కడ ఉన్న మూడు ట్రిప్పర్లను అధికారులు సీజ్ చేశారు. మట్టి తవ్వడానికి వాహనాలతో కొంతమంది వచ్చారని పలాస తహశీల్దారు టి.కళ్యాణచక్రవర్తికి సమాచారం రావడంతో రాత్రి 8 గంటల సమయంలో కాశీబుగ్గ పోలీసులతో వెళ్లారు. వాహనాలను సీజ్ చేసి కార్యాలయానికి తరలించారు. బుధవారం సంబంధిత వ్యక్తులను పిలిపించి ట్రిప్పర్‌కు రూ.10వేలు చొప్పున రూ.30వేలను అపరాధ రుసుం విధించారు. ఈ దాడుల్లో ఆర్ఐ కైలాసం, కాశీబుగ్గ ఎస్ఐ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం ఫేజ్-2 ప్రాజెక్టు ట్యాంకుకు స్థల పరిశీలన

పాతపట్నం: మండలంలోని కొరసవాడ–బోరుబద్ర గ్రామాల మధ్య కొండ సమీపంలో ఉద్దానం ఫేజ్-2 ప్రాజెక్టుకు వాటర్ ట్యాంకు నిర్మించేందుకు నాలుగు ఎకరాల స్థలాన్ని టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. రూ.260 కోట్లతో పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలంలోని వివిధ గ్రామాలలకు తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంకు నిర్మాణం, పైపులైన్ పనులు చేపట్టనున్నారు. ఉద్దానం ప్రాజెక్టు పనులు త్వరితగతిని చేయాలని ఆర్డీఓ ఇంజినీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.చంద్రకుమారి, ప్రాజెక్టు డీఈఈ ఆశలత, మండల సర్వేయర్ రామగణపతి, ప్రాజెక్టు ఇంజినీర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి

టెక్కలి రూరల్: మండల కేంద్రం టెక్కలిలోని చేరివీధికి చెందిన పైల ప్రతాప రెడ్డి(38) అనే ఆర్మీ జవాన్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలో జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రతాపరెడ్డి మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందారు. మృతదేహాన్ని టెక్కలి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతాపరెడ్డికి భార్య ధనం, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్లుప్తంగా

రైతుసేవా కేంద్రం పరిశీలన



విజినిగిరిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులకు సూచనలిస్తున్న డీఎం వెంకటేశ్వరరావు

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: అపరాల (పెసర, మినుము) పంటలను రైతులు విక్రయించేసిన తరువాత ప్రభుత్వం అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్న అంశంపై సాక్షిలో బుధవారం 'ఎవరి లాభం కోసం' శీర్షికన ప్రచురితమైన కథనంపై మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేశ్వరరావు స్పందించారు. ఈ మేరకు జామి మండలంలోని విజినిగిరిలో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులు మాత్రమే అపరాలను విక్రయించుకోవాలని దళారులు ఎవరైనా అపరాలు విక్రయించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జెడ్పీ చైర్మన్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



ప్రణీత్ బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

విజయనగరం: జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. ఇటీవల జెడ్పీ చైర్మన్ చిన్న కుమారుడు మృతి చెందిన నేపథ్యంలో పార్టీ నాయకురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి జెడ్పీ చైర్మన్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. తొలుత ఆమె మృతిచెందిన ప్రణీత్ బాబు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కి స్తున్న సిబ్బంది

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఉదయం 10 గంటల నుంచి దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీలను తెరిచి ఆదాయాన్ని సిబ్బంది లెక్కించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 23 రోజులకు గాను రూ.3,08,943 ఆదాయం సమకూరినట్లు ఈవో సూర్యనారాయణ తెలిపారు. అలాగే 36 గ్రాముల బంగారం, 1900 గ్రాముల వెండి హుండీల్లో లభించిందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



రోడ్డుప్రమాదంలో మరణించిన గౌరమ్మ

సాలూరు: రామభద్రపురం మండలం చింతలవలస గ్రామానికి చెందిన టి.గౌరమ్మ(47) సాలూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతిచెందింది. ఈ ఘటనపై సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలంలోని ఎర్రసామంతవలస వద్ద చర్చికి ప్రార్థనలకు వెళ్లి వస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణిస్తుండగా సాలూరులోని కోటవీధి జంక్షన్ వద్ద బైక్ మధ్యలో కూర్చున్న గౌరమ్మ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో రైల్వే స్తంభాల లోడుతో వెళ్తున్న లారీ ఆమెపై నుంచి వెళ్లడంతో శరీరం నుజ్జునుజ్జయి వెంటనే మరణించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మట్టి మాఫియా ఆగడాలు

- యథేచ్ఛగా రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- అధికార పార్టీ నాయకుల అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- చేతులెత్తేసిన రెవెన్యూ యంత్రాంగం



కొట్టక్కి రెవెన్యూ పరిధిలో జేసీబీలతో మట్టి తవ్వుతూ లారీలకు లోడ్ చేస్తున్న దృశ్యం



ట్రాక్టర్‌తో వేరే ప్రాంతానికి మట్టి తరలిస్తున్న దృశ్యం



సాలూరు వెళ్లే రూట్‌లో జాతీయ రహదారి పక్కన సైట్‌లో మట్టి వేసి నెరుపుతున్న బ్లేడ్ ట్రాక్టర్

రామభద్రపురం: మండలంలో మట్టిమాఫియా ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికార పార్టీ నాయకుల అండతో గ్రామాల్లోని చెరువులు, చెరువు పోరంబోకు, గెడ్డ పోరంబోకుల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ చోటామోటా నాయకులు వారి జేబులు నింపుకుంటున్నారు. టీడీపీ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు ఉండడం, ఒక వేళ ఫిర్యాదు వచ్చినా నామమాత్రంగా పరిశీలించి మిన్నకుండిపోవడంతో మండలంలో మట్టి మాఫియా పేట్రేగిపోతూ అక్రమ రవాణా సాగిస్తోంది. ఎన్నడూలేని విధంగా రాత్రింబవళ్లు మట్టిని తరలిస్తున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నా అటువైపు కన్నెత్తి చూసే సాహసాన్ని కూడా అధికార యంత్రాంగం చేయడం లేదు. ఎవరో ఒకరు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే అటువైపు వెళ్తున్నారు తప్ప..అక్రమ రవాణాను అడ్డుకుందామన్న స్పృహ వారికి లేదని, ఒక వేళ అడ్డుకున్నా అధికార పార్టీ నాయకుల నుంచి ఫోన్‌కాల్ వచ్చిన వెంటనే వెనుదిరుగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని కొట్టక్కి రెవెన్యూ పరిధిలో రేయింబవళ్లు చెరువు పోరంబోకు, చెరువులు, గెడ్డ పోరంబోకులో జేసీబీలతో విలువైన మట్టిని తవ్వి వందలాది ట్రాక్టర్లు, పెద్దపెద్ద ట్రక్కులు, లారీల ద్వారా మన్యం జిల్లా సాలూరు పట్టణానికి చెందిన మాఫియా అక్రమంగా తరలిస్తున్నారు. రామభద్రపురం నుంచి సాలూరు వెళ్లే ఎన్‌హెచ్ 26 రోడ్డు పక్కన ఉన్న సైట్‌లు ఎత్తు చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పడంతో పాటు స్థానిక టీడీపీ నాయకుడు, సాలూరుకు చెందిన ఓ చౌదరికి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.150 వరకు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారం మనదే అడ్డుకునేవారే లేరంటూ అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు సైతం అడ్డుకోవడానికి కూడా వీల్లేదంటూ చోటా నాయకులు హుకుం జారీ చేసి మరీ మట్టి తవ్వకాలు నిర్వహించడం గమనార్హం. అక్రమార్కులు మట్టి ఎక్కడికి తరలిస్తున్నారో తెలిసినా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో రెవెన్యూ అధికారులు అక్రమ తవ్వకాలను అడ్డుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. ప్రకృతి సంపదను దోపిడీ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని గ్రామస్తులు ప్రత్యక్షంగా ఆందోళన చేసినా..లేక ఫిర్యాదు చేసినా అధికారులు అడపాదడపా దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారు తప్ప కట్టడి చేసే ప్రయత్నాలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఫిర్యాదు చేసినా స్పందన లేదు



మూడు రోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. వెళ్లి అడ్డుకుని, ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు స్వయంగా ఫిర్యాదు చేశాను. కనీస స్పందన లేదు. మొన్న జూనియర్ అసిటెంట్ వచ్చి అడ్డుకుని జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తుండగా ఎక్కడి నుంచో ఫోన్ రావడంతో వెంటనే వదిలేసి వెళ్లిపోయారు. మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే అటువైపు వెళ్తున్నారు కానీ అడ్డుకోవడం లేదు.

అలమండ ఆనందరావు, సీపీఐ జిల్లా జాయింట్ సెక్రటరీ, కొట్టక్కి

సిబ్బందిని పంపి అడ్డుకుంటాం..



మాకు ఫిర్యాదు అందింది. కానీ వారి సొంత భూమిలో తవ్వుకుని, వారి పొలంలోనే వేసుకుంటున్నామని చెబుతున్నారు. మా అధికార సిబ్బందిని పంపించగా వెళ్లి పరిశీలించారు. తవ్వడం వాస్తవమే. అయితే వారి సొంత పొలం తవ్వుకుని వేసుకుంటున్నారని చెబుతున్నారు. అయినా నిబంధనల ప్రకారం ఎక్కడ తవ్వినా అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. మరోసారి సిబ్బందిని పంపించి అక్రమ రవాణాను అడ్డుకుంటాం.


ఎ సులోచనరాణి, తహసీల్దార్, రామభద్రపురం

సైబర్‌వలలో మహిళ

- బ్యాంక్ ఖాతా నుంచి రూ.99,200 మాయం



డబ్బులు పోగొట్టుకున్న వసంతకుమారి



అకౌంట్ నుంచి రూ.99,200 డెబిట్ అయినట్లు వచ్చిన మెసేజ్



వసంతకుమారి మొబైల్‌కు సైబర్ నేరగాళ్లు పంపించిన వాట్సాప్ మెసేజ్

వీరఘట్టం: ఇటీవల సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోతున్నారు. మొబైల్ ఫోన్‌కు లింకులు, వాట్సాప్ మెసేజ్‌లు పంపిస్తూ అమాయకులను టార్గెట్ చేసి వారి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. తాజాగా వీరఘట్టం మెయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న భోగి వసంతకుమారి అనే మహిళ బ్యాంకు ఖాతా నుంచి మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో రూ.99,200లు కొట్టేశారు. ఏయూ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంక్‌లో ఉన్న ఖాతా నుంచి డబ్బులు డెబిట్ అయినట్లు ఆమెకు మెసేజ్ వచ్చింది. అయితే ఆ మెసేజ్‌ను ఆమె కుమారుడు శ్రీధర్ తెల్లవారాక చూసి ఒక్కసారిగా నివ్వెరపోయాడు. వీరఘట్టంలో ఉన్న ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్రాంచ్ వద్ద వెళ్లి చెక్ చేయగా ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా ఆమె అకౌంట్‌లో డబ్బులు తీసేసినట్లు గుర్తించారు. మంగళవారం రాత్రి 9.10 గంటల సమయంలో ఒకసారి, 9.30 గంటల సమయంలో మరోసారి 9163020468 నంబర్ నుంచి వసంతకుమారి ఫోన్‌నంబర్‌కు హాయ్ అనే వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తర్వాత రాత్రి 10.06 గంటలకు డబ్బులు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది.ఈ విషయంపై స్థానిక పోలీసులను వారు సంప్రదించి జరిగిన మోసాన్ని వివరించారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై మరోసారి దర్యాప్తు



తహసీల్దార్ సులోచనరాణిని ఆరా తీస్తున్న ఎస్‌డీసీ ప్రమీలా గాంధీ

రామభద్రపురం: మండలకేంద్రంలోని సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్‌పై దర్యాప్తు ముమ్మరం చేశారు. అందులో భాగంగా బుధవారం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సులోచనరాణితో కలిసి దర్యాప్తు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏడాది క్రితం బీఎల్‌వో విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు అతడి సమాధానం కూడా బాగాలేదన్న ఉద్దేశంతో తహసీల్దార్ సులోచనరాణి ఆర్డీవోకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఆర్డీవో కూడా కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అప్పటి కలెక్టర్ సదరు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సదరు ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్‌కు దాదాపు 6 నెలల క్రితం పోస్టింగ్ కూడా ఇచ్చేశారు. అయితే అప్పట్లో దర్యాప్తు సక్రమంగా జరగలేదని, ఇప్పుడు మళ్లీ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. తహసీల్దార్ సులోచనరాణిని అప్పట్లో ఏం జరిగిందో ఎస్‌డీసీ ప్రమీలా గాంధీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం పాల్గొన్నారు.

వంటావార్పుతో కార్మికుల ఆందోళన



వంటావార్పుతో అందోళన చేస్తున్న కార్మికులు సీఐటీయూ నేత జగన్

వేపాడ: మండలంలోని బొద్దాంలో చెక్‌పోస్టువద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో రైతులు, కార్మికులు బుధవారం వంటావార్పుతో ఆందోళన నిర్వహించారు. చెక్‌పోస్టు ఎత్తివేయాలని లేదా వెసులుబాటు కల్పించాలంటూ కార్మికులు నినాదాలు చేశారు. ఈ ఆందోళనపై స్పందించిన ఉత్తరాంధ్ర మైన్స్ అండ్ జియాలజీ విజిలెన్స్ ఎ.డి. అజయ్‌కుమార్ బొద్దాం చేరుకుని సమస్యపై ఆరాతీశారు. దీనిపై సీఐటీయూ జిల్లానేత చల్లాజగన్ మాట్లాడుతూ ప్రైవేట్ చెక్‌పోస్టు సిబ్బంది, విజిలెన్స్ బోర్డులు పెట్టుకుని అక్రమాలుచేస్తున్నారని ఎ.డికి వివరించారు. రైతులు సొంత పొలాల్లో నుంచి మట్టి తోలుకున్నా, గృహనిర్మాణదారులు పునాదులు పూడ్చుకోవడానికి తెచ్చుకున్నా అక్రమంగా వసూలు చేస్తున్నారని ఈ ఇబ్బందుల నుంచి రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లకు విముక్తి కలిగించాలని కోరారు. దీనిపై ఎ.డి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ మట్టి, కారురాయి తోలకాలకు మినహాయింపు కల్పిస్తామన్నారు. అయితే లే అవుట్‌ల వ్యాపారాలకు తోలేవాటికి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రైవేట్ చెక్‌పోస్టుల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. దీంతో కార్మికులు ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఎ.జి.మల్లేశ్వరావు, బొద్దాం గ్రామపెద్ద ఎర్రా సన్యాసిరావు, యూనియన్ నాయకులు గేదెల శ్రీను, తూర్పాటి సతీష్, శ్యామ్, కృష్ణ, రవి, శివప్రసాద్, రామకృష్ణ, బాలు, సన్నిబాబు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ అప్పలనాయుడు, వల్లంపూడి ఎస్సై దేవి, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పీడీఎస్ బియ్యం పక్కదారి..!

- టన్నుల కొద్దీ తరలిస్తున్న వ్యాపారులు
- రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్
- మళ్లీ అవే బియ్యం పౌరసరఫరాల శాఖ గొడౌన్లకు తరలింపు

2024-25లో నమోదైన కేసులు, పట్టుకున్న బియ్యం వివరాలు:

నెల	కేసుల సంఖ్య	పట్టుకున్న బియ్యం (క్వింటాల్స్)
జనవరి	3	14.50
ఫిబ్రవరి	9	129.81
మార్చి	14	107.35
ఏప్రిల్	10	53.07
మే	5	55.45
జూన్		49.89
జూలై	3	101.26
ఆగస్టు	17	668.05
సెప్టెంబర్	3	193.69
అక్టోబర్	6	174.60
నవంబర్	7	236.30
డిసెంబర్	8	175.2



గజపతినగరం మండలంలోని ఓ రైస్ మిల్లులో పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో అధికారులు(ఫైల్)



గరివిడి మండలంలో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్, సివిల్ సప్లైస్ అధికారులు(ఫైల్)

విజయనగరం ఫోర్ట్: ఇటీవల గజపతినగరం మండలంలోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకుని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

- కొద్దినెలల క్రితం గంట్యాడ మండలం చంద్రంపేట గ్రామంలో ఉన్న రైస్ మిల్లు గొడౌన్‌కు పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో వీఆర్వో వెళ్లి రెండున్నర టన్నుల పీడీఎస్ బియ్యాన్ని, తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు.
- ఇదే మండలంలో ఉన్న మరో మిల్లులో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందడంతో సివిల్ సప్లైస్, రెవెన్యూ అధికారులు మిల్లు వద్దకు చేరుకుని పీడీఎస్ బియ్యం తరలించే వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యం 1500 కేజీలుగా గుర్తించారు. వాటిని అధికారులు సీజ్ చేసి మిల్లు యాజమానిపైన, తరలించిన వ్యక్తిపైన కేసులు నమోదు చేశారు.
- ఇలా ఈ మూడు చోట్లే కాదు. జిల్లాలోని అనేక చోట్ల పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు పీడీఎస్ బియ్యాన్ని మిల్లులకు తరలిస్తూ మిల్లులో బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి వాటినే మళ్లీ ప్రజాపంపిణీ వ్యవస్థ గొడౌన్లకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు

పీడీఎస్ బియ్యం అధికారుల కళ్లముందే తరలిపోతున్నా తమకేమీ కనబడడం లేదన్న రీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో పీడీఎస్ బియ్యం ఎక్కువగా పక్కదారి పట్టిస్తున్నా గ్రామాల్లో ఉండే వీఆర్వోలు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో యథేచ్ఛగా పీడీఎస్ బియ్యం తరలిపోతున్నట్లు తెలుస్తోంది.

2024-25 లో 90 కేసులు నమోదు:

2024-25 లో పీడీఎస్ తరలించిన 90 మందిపై 6 ఎ కేసులు నమోద య్యాయి. 1959 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. 2025-26లో 23 మందిపై 6 ఎ కేసులు నమోదయ్యాయి. 99.86 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు.

ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం



పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టించకూడదు. సీ ఎస్‌డీటీలు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ కేసులు నమోదు చేస్తున్నారు. ఒక వేళ ఎవరైనా పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లయితే అటువంటి వారిపై 6ఎ కేసులు నమోదు చేసి జాయింట్ కలెక్టర్ కోర్టులో ప్రవేశపెడతాం.

కె.మధుసూదన్‌రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి

10 మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని బత్తివలస గ్రామంలో అనధికార మద్యం షాపుల నుంచి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా మద్యం షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార మద్యం దుకాణాలు నిర్వహించినా, వేలం వేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై చంద్రమోహన్, హెచ్‌సీ ప్రతాప్, సూర్యనారాయణ, శిరీష పాల్గొన్నారు.

టేకు తోటలో అగ్ని ప్రమాదం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామ శివారులో ఉన్న టేకు, మామిడి తోటలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..గుర్తు తెలియని వ్యక్తులు పొగ తాగి తోటలో విసిరేయడం వల్ల ఆకులకు నిప్పు అంటుకుని దట్టంగా మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే స్పందించి మంటలను అదుపు చేయడంతో ఆస్తినష్టం తప్పింది. ఎంపీటీసీ చిన్నం నాయుడు, గ్రామ పెద్దలు ఘటనా స్థలిని పరిశీలించారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పార్వతీపురం: గిరిజన సబ్‌ప్లాన్ (టీఎస్‌పీ) ప్రాంత అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ పీడీ డా.టి.కనకదుర్గ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో తొమ్మిది అంగన్వాడీ వర్కర్లు, 15 అంగన్వాడీ హెల్పర్లు, 12 మినీ అంగన్వాడీ కార్యకర్తల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఖాళీలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం డివిజన్ పరిధిలో వీఆర్‌పేట అంగన్వాడీ వర్కర్-1, అంగన్వాడీ హెల్పర్-1, మినీ అంగన్వాడీ కార్యకర్త-1 కేటాయించినట్లు పేర్కొన్నారు. అలాగే కొమరాడలో మినీ అంగన్వాడీలు-2, సాలూరులో అంగన్వాడీ వర్కర్లు-2, హెల్పర్లు-2, మినీ అంగన్వాడీ కార్యకర్తలు-2, పాచిపెంట మండలంలో అంగన్వాడీ వర్కర్-1, హెల్పర్లు-5, మినీ అంగన్వాడీ కార్యకర్తలు-5, మక్కువ మండలంలో అంగన్వాడీ వర్కర్లు-3, హెల్పర్-1 పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

పాలకొండ డివిజన్‌లో..


పాలకొండ డివిజన్‌లోని కురుపాం మండలంలో అంగన్‌వాడీ వర్కర్-1, హెల్పర్-1, జియ్యమ్మవలసలో హెల్పర్-2 భద్రగిరిలో అంగన్వాడీ వర్కర్-1 హెల్పర్-1, గుమ్మలక్ష్మీపురంలో హెల్పర్-2 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆశక్తిగల అర్హులైన వివాహితలు దరఖాస్తులను ఏప్రిల్ 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుదారులను మాత్రమే ఇంటర్వ్యూలకు పిలవనున్నట్లు స్పష్టం చేశారు. అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు, మినీ అంగన్వాడీల నియామకానికి స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహితల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అంగన్వాడీ సహాయకుల పోస్టుకు జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. ఎస్టీ కేంద్రాలకు ఎస్టీ కేటగిరికి రోస్టర్‌లో రిజిస్టర్ అయిన పోస్టులకు 21 ఏళ్లు నిండిన అభ్యర్థులు లేని పక్షంలో 18 ఏళ్లు నిండినవారిని పరిగణనలోకి తీసుకోనున్నట్లు చెప్పారు. అంగన్వాడీ సహాయకుల ఎంపికలో గ్రామం స్థానికత ప్రాతిపదికగా, దరఖాస్తులను సీడీపీఓ కార్యాలయంలో అందజేసి రశీదు తీసుకోవాలని సూచించారు.

ఏసీబీ వలకు చిక్కిన మత్స్యశాఖాధికారి

- సీడ్ ఏజెన్సీకి బిల్లులు చెల్లించినందుకు రూ.60 వేలు డిమాండ్
- ఏసీబీ అధికారులను ఆశ్రయించిన ఏజెన్సీ నిర్వాహకుడు
- వలపన్ని పట్టుకున్న అధికారులు



లంచం తీసుకుంటూ పట్టుబడిన వేములు తిరుపతయ్య



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

పార్వతీపురంటౌన్: బలహీన వర్గాలకు చెందిన మత్స్యకారులకు సీడ్ బిల్లుల చెల్లింపులో పార్వతీపురం మన్యం జిల్లా మత్స్యశాఖాధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖాధికారులకు బుధవారం పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొండ మండలం టీడీ పురానికి చెందిన బొప్పన అప్పన్నదొరకు చెందిన కోటదుర్గ ఫిష్ సీడ్ సంస్థలోని విత్తన నిల్వలను తనిఖీ చేసి, రూ.60 లక్షల బిల్లు మంజూరు చేసినందుకు జిల్లా మత్స్యశాఖాధికారి వేముల తిరుపతయ్య రూ.60 వేలు డిమాండ్ చేశారు. బాధితుడు అప్పన్నదొరకు లంచం ఇవ్వడం ఇష్టంలేక విజయనగరంలోని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వలపన్నాం. బాధితుడి నుంచి పార్వతీపురంలోని మత్స్యశాఖ కార్యాలయంలో రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నాం. ఆయనపై కేసు నమోదు చేసి, డబ్బులు సీజ్ చేశాం. నిందితుడిని విశాఖపట్టణంలోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. దాడిలో సీఐలు మహేశ్వరరావు, భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలబాలికలను లైంగికంగా వేధిస్తే 20ఏళ్ల జైలుశిక్ష

- ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.విజయకల్యాణి



సదస్సులో మాట్లాడుతున్న ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.విజయకల్యాణి

విజయనగరం/నెల్లిమర్ల రూరల్: లైంగికంగా బాల, బాలికలను వేధించినా, అవమాన పరిచినా..నేరం చేసిన వ్యక్తికి కనీసం 20 ఏళ్ల జైలుశిక్ష విధించనున్నట్లు ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.విజయకల్యాణి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఉత్తర్వుల మేరకు విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి ఆదేశాలతో బుధవారం ఆమె నెల్లిమర్ల మండలంలోని కొండగుంపాం గ్రామంలో పోక్సో చట్టంపై న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ దగ్గర వారే మన బాలికలపై నేరానికి పాల్పడుతుంటారని, అటువంటి వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు వారి పిల్ల లపట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ఈ సందర్భంగా గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్రస్తుత పిల్లలు టీనేజ్ వయస్సులో లేనిపోని ఆకర్షణలకు గురవుతుంటారని, ఇంటర్‌నెట్ ప్రభావానికి లోను కాకుండా విద్యపై దృష్టి సారించాలని చెప్పారు. ఏ విషయాన్నైనా నిర్భయంగా తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల దగ్గర జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు,, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ డి.సీతారాం, కొండగుంపాం గ్రామసర్పంచ్ పి.అప్పన్న, నెల్లిమర్ల ఎస్సై ఎం.గణేష్, కొండగుంపాం గ్రామ సచివాలయ కార్యదర్శి ఎల్.తౌడు, సచివాలయ సిబ్బంది, జిల్లా న్యాయ సేవాధికార సిబ్బంది, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

డోలీ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రయత్నం

- కందుల సాగుకు ప్రోత్సాహం
- తలసరి ఆదాయం పెంచే దిశగా చర్యలు
- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాను డోలీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సీఎం చంద్రబాబు నాయుడికి తెలిపారు. రెండవ రోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో బుధవారం ఆయన జిల్లా ప్రగతిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉందని, కొండ ప్రాంతాల్లో రహదారి సదుపాయం లేక డోలీలు వినియోగిస్తున్నారని, ఆ పరిస్థితి కనిపించకుండా ఉండేలా రహదారి సదుపాయం కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. 250 మంది ప్రజలున్న ఆవాసాలకు కూడా రహదారి సదుపాయం కల్పించాలనే దిశగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. అపరాల సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో అనీమియా ఎక్కువగా ఉందని తాన్ని కూడా తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం జిల్లా తలసరి ఆదాయం రూ. 1.67 లక్షలుగా ఉందని దాన్ని వచ్చే 2025-56 ఆర్థిక సంవత్సరంలో రూ. 1.94 లక్షలకు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ప్రగతికి పర్యాటరంగం ఎంతో దోహదపడుతుందని, పర్యాటక రంగంలో జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రచించామని వివరించారు. జిల్లాలో ట్రైబల్ ఇంజినీరింగ్ కాలేజి నిర్మాణం 60 శాతం పూర్తి కావచ్చిందని తెలిపారు.